# గమనిక

బస్సు స్టేషన్‌లో ఆగగానే కండక్టర్ దిగి కంట్రోలర్ రూమ్ వైపు, డ్రైవర్ క్యాంటీన్ వైపు నడిచారు.

దిగవల్సిన ప్రయాణీకులు లేచి నిల్చోగానే, సీటుకోసం కిటికీల గుండా దస్తీలను, న్యూస్‌పేపర్లను సీట్లపై పెడుతున్నారు. దిగే జనం దిగకముందే ఎక్కేవాళ్లు బస్సులోకి తోసుకపోతున్నారు.

"మమ్మల్ని దిగనీయండి!" అంటూ ఎక్కేవాళ్ళను ఓ మాదిరిగా చూస్తూ ఒక్కొక్కరే బయటపడుతున్నారు. మొత్తంమీద దిగవలసిన వాళ్ళు దిగి ఎక్కవలసినవాళ్లు ఎక్కారు. బస్ నిండిపోయింది.

"గుడ్డోణ్ణిబాబూ ధర్మం చెయ్యండి!"

"అమ్మా! కుంటోణ్ణి దానం చెయ్యండి"

"చెప్పలేదంటనక పొయ్యేరు సరులారా మీరు..." ంటున్న మరొకడి కాలజ్ఞాన తత్వపు పలుకులు ఒకరి వెనుక మరొకరు బస్సులోకి ఎక్కి, సీటు సీటు తిరుగటా అడుక్కుంటున్నారు.

"ఎంతమందికని వెయ్యాలి?" ఆడవాళ్ళ సీట్లలో నుండి ప్రశ్న

"కండక్టరొస్తాడు దిగండ్రా!" ఎవరో పెద్దమనిషి ఎచ్చరిక

అప్పుడప్పుడు గిన్నెలో నాణాలు పడుతున్న శబ్దం, తుడుముతూ తడుస్తున్న గుడ్డివాని కర్రకున్న గజ్జల చప్పుడు.

కండక్టర్ బస్సెక్కి యస్సారును పై అంలో పెట్టి టికెట్స్ బంచ్‌ని పట్టుకోని "టికెట్......టికెట్" అంటూ వెనుక సీట్ల వైపు నడుస్తూ బెల్ కొట్టాడు. "ఆగండి బాబయ్యా!" అంటూ గుడ్డి, కుంటి, ముదుసలి ఒకరెనుక మరొకరు దిగి వెళ్ళారు.

"డ్రైవర్ ఇంకా రాలేదు సార్" ముందు సీట్లో కూర్చుని పాస్‌మీద ప్రయాణం చేస్తున్న స్టాఫ్ సభ్యుని సమాధానం.

"డ్రైవర్‌గారి నాస్త ఇంకా కానట్టుంది" ఓ ప్యాసింజర్

"పుకట్‌కా నాస్తా పట్టించెయ్ మరికాస్తా" మరో ప్యాసింజర్

"అంటే" మధ్యలో మొదటి ప్యాసింజర్

"అదో పెద్ద వ్యాపార రహస్యమంది స్వామి. కావలసినంత సేపు బస్సాపితే తినవలసినంతమంది టిఫిన్స్ తింటారు. టీ తాగుతారు మిగతా విషయం నేను చెపక్కర్లేదనుకుంటా" వెనుక సీట్ల నుండి టికెట్స్ ఇస్తూ, నిలుచున్న ప్యాసింజర్స్‌ను ఒక్కొక్కర్నె వెనక్కు నెట్టితూ, రిజర్వుడు అని రాసివున్న సీట్లవరకొచ్చాడు కండక్టర్. రిజర్వుడు సీట్లలో కిటికి వైపు ఓ పెద్దమనిషి బస్సు బయలుదేరిన స్టేషన్ నుండి కూర్చున్నాడు.

బస్సు కదిలే ముందు సన్నగ, తెల్లని ఖరీదైన ప్యాంటు, బుషర్ట్‌లో ఓ పాతికేళ్ళ యువకుడు వచ్చి పెద్దమనిషి పక్కనే కూర్చుంటూ, సరిపోను చిల్లరను కండక్టర్‌కిస్తూ "నెక్స్ట్‌స్టేజ్" అన్నాడు. కండక్టర్ టికెట్ పంచ్‌చేసి ఇచ్చి, పెద్దమనిషి వైపు చూస్తూ "మీరు టికెట్" మధ్యలో కొంచెం ఆగి "తీసుకున్నారు" అనుకుంటూ ముందుకు నడిచి, స్టీరింగ్ ముందుకొచ్చి కూర్చుంటున్న డ్రైవర్ నుద్దేశిస్తూ "రైట్" అన్నాడు.

బస్సు కదిలింది.

"ఈ కండక్టర్ స్టేజి స్టేజీకి టికట్ టికట్ అని అందర్ని అడుగుతడు. ఎవరికి టికెట్ ఇచ్చింది, ఎవ్వరికి ఇవ్వంది గుర్తుండదా ఏంది?" అంటూ పక్కనే కూర్చున్న యువకుని వైపు చూశాడు. యువకుడు చిరునవ్వుతో అవునన్నట్టు తల వూపి ఆయన కళ్ళకున్న గోల్డ్ ఫ్రేమ్ అద్దాలను, చేతికున్న వుంగరాలను తొడుక్కున్న పట్టు లాల్చీని చూశాడు. సగం నెరిసిన తల ఏభై ఏళ్ళను సూచిస్తుంది.

"హైద్రాబాద్ వరకాండీ" ఎంతో వినయంతో అడిగాడు యువకుడు.

అవునన్నట్లు తల వూపాడు పెద్దమనిషి.

"మీ పేరుసార్" మర్యాద వుట్టిపడే స్వరంతో-

"నారాయణరావు" అంటూ అంత వరకు ఎడమచేతిలో పట్టుకున్న త్రిబుల్‌ఫైవ్ సిగరెట్ పాకెట్ నుండి ఓ సిగరెట్ తీసి వెలిగించాడు.

"ఏం చేస్తుంటారు?"

"వ్యాపారం" పొగతో పాటు పొడిగ

"పొగతాగరాదు అని రాసుంది కదా సర్" అంటూ చిన్నగా నవ్వుతూ ఎదురుగారాసిన హెచ్చరికను చూపించాడు.

"ఆఁ ఛల్తే రహతా?" అన్నాడు పీల్చిన పొగను. వదుల్తూ.

"డ్రైవర్ బస్సాపితే"

"ఆఁ! ఆయన రూల్ ప్రకారంగా బస్సు నడుపుతున్నాడంటావా! రోడ్డుకి లెఫ్టగానే వెళ్ళాలి, మరి సెంటర్ నుంచి ఎందుకెళ్తున్నట్టు?" అంటూ మళ్ళీ పీల్చాడు.

యువకుడు శ్రద్ధగా వింటూ ఆయన వైపే చూస్తున్నాడు.

"కండక్టర్ అందరికి టికెట్ యిచ్చాడంటావా?"

యువకుడు మౌనంగా నవ్వాడు.

"ప్యాసింజర్స్‌కి పొగ యిబ్బంది అవుద్దేమో అని" అంటూ నారాయణరావు వైపు చూశాడు సంభాషణ పెంచుతూ.

"ప్యాసింజర్స్ మాత్రం ఏపాటి రూల్స్‌ని పాటిస్తున్నారు? నోస్టాడింగ్ ప్యాసింజర్స్ అని అక్కడ రాసుందికదా! మరి వీళ్ళంతా ఎందుకు నిలుచుండి ప్రయాణిస్తున్నట్టు?" ఓసారి నిల్చున్న ప్రయాణీకుల్ని చూసి- యువకుడు మళ్ళీ చిన్నగానవ్వాడు.

"మీకయితే ఇబ్బంది లేదుకదా?" అడిగాడు పెద్దమనిషి.

"అదేంలేదు సార్! నేను దిగ్ స్టేజికూడా వచ్చేసింది. వస్తానండి. సారీసర్! మిమ్మల్ని బాధపెట్టిన్నాండీ" అంటూ బస్సు ఆగగానే చిరునవ్వుతో దిగిపోయాడు.

"పనికిమాలిన ప్రతి వెధవా, రూల్స్, చట్టం, నీతి, అవినీతి గూర్చి చెబితే యిక ఈ దేశం-" అని గొనుక్కుంటూ మరో

సిగరేట్ వెలిగించాడు నారాయణరావు.

ఈ లోపున బస్ సిటీ బస్‌స్టాండ్ చేరింది. కండక్టర్ రాసిన చిల్లర తీసుకోవడానికి జేబులో చెయ్యి పెట్టాడు నారాయణరావు. చేయి కిందకి కిందకి పోయింది. అతని కళ్ళు తత్తరపడ్డాయి. నుదుట చిరు చెమటలు కమ్ముకున్నాయి. నాలుక తడారిపోయింది. గొంతు పెగల్లేదు. జేబులో పర్స్ లేదు.

"సారీసర్" అంటున్న ఆ యువకుని ముఖమే కదిలింది తన కళ్ళలో నారాయణరావు కొద్దిగా తేరుకుని కండక్టర్ వైపు మళ్ళి

"నా పర్స్"

"పోయిందా?" కండక్టర్ చెవిలోని పెన్సిల్ను చేతిలోకి తీసుకుంటూ నారాయణరావు జేబువంక జూశాడు.

వార్త బస్సంతా పాకింది. బస్సులో వున్నవాళ్ళంతా తమ తమ జేబుల్ని తడిమి చూసుకున్నారు.

"పోలీస్‌స్టేషన్ వెళ్ళి రిపోర్టిస్తే" అంటూ కండక్టర్ వైపు తిరిగాడు నారాయణరావు

"మీ ఇష్టం అలాగే యిద్దాం: ఎంతడబ్బు పోయిందో మీకు ఐడియా వుందాండి?"

"వాడు ఎప్పుడో, ఎక్కడో, దిగిపోతే ఇప్పుడు ఇక్కడ పోలీసు స్టేషన్లోయిస్తే ప్రయోజనం, పోయినవిరావు, పోగయింకా" అన్నాడు ఓ పెద్దమనిషి.

"చల్ తేరహాత" అన్నాడు కండక్టర్.

నారాయణరావుకు కొరడాతో కొట్టినట్లయింది.

○